ప్రయాణికులకు నిలువ నీడ కరువు



నిరుపయోగంగా వల్లూరు బస్‌షెల్టర్



శిథిలమైన వరదరాజపురం బస్‌షెల్టర్

- నిరుపయోగంగా బస్‌షెల్టర్లు
- నీరుగారుతున్న దాతల ఆశయం

గణపవరం: బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. రోడ్లపైనే ప్రయాణికులు బస్‌లు, ఆటోల కోసం ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ వేచి ఉండాల్సి వస్తుంది. నిర్వహణ లోపంతో పలు చోట్ల బస్‌షెల్టర్లు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని రోడ్డుకన్నా పల్లంగా ఉండి వర్షంనీరు చేరుతుంది. ఇది గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న బస్‌షెల్టర్స్ దుస్థితి. ప్రయాణికుల సౌకర్యార్థం దాతలు ఆయా గ్రామాల కూడళ్లలో ఆర్టీసీ బస్‌లు ఆగే ప్రదేశాల్లో బస్‌షెల్టర్లు నిర్మించారు. కొంతకాలం పాటు అవి ప్రయాణికుల అవసరాలు తీర్చాయి. రానురాను వాటి నిర్వహణను పట్టించుకునే నాథుడులేక శిథిలావస్థకు చేరాయి. కొన్నిచోట్ల రోడ్లు నిర్మించడంతో బస్‌షెల్టర్లు రోడ్డు కన్నా పల్లంగా ఉన్నాయి. వాటిలో వర్షంనీరు చేరి నిరుపయోగంగా మారాయి. కొన్ని బస్‌షెల్టర్లలో సిమెంట్ బల్లలను ఆకతాయిలు విరగ్గొట్టారు. వరదరాజపురం వద్ద మూడు దశాబ్దాలకు పైగా ప్రయాణికులకు నీడ కల్పించిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. ప్రయాణికులు కూర్చునే సిమెంట్ బల్లలు విరిగిపోయాయి. గణపవరం గాంధీ నగర్ వద్ద బస్‌షెల్టర్, జల్లికొమ్మరలో బస్‌షెల్టర్ నిరుపయోగంగా ఉన్నాయి. ముప్పర్తిపాడు వద్ద బస్‌షెల్టర్ రోడ్డుకు సమాంతరంగా ఉంది. పిప్పర సెంటర్‌లోని బస్‌షెల్టర్‌లో కొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు బాధ్యత తీసుకుని బస్‌షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నిర్లక్ష్యం నీడలో..

దెందులూరు: నిర్లక్ష్యం నీడలో బస్సు షెల్టర్లు కొట్టుమిట్టాడుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో చెట్లు, చెత్త చెదారం పేరుకుపోయి భయంకరంగా దర్శనమిస్తున్నాయి. ఇది దెందులూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న బస్ షెల్టర్ల దుస్థితి. బస్‌షెల్టర్లను శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



నిరుపయోగంగా కొమ్మర బస్‌షెల్టర్



ప్రమాదకరంగా వీరేశ్వరపురం బస్‌షెల్టర్



నిరుపయోగంగా ఉన్న దెందులూరు బస్‌షెల్టర్

21 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

దెందులూరు: నవంబర్ 21 నుంచి 23 వరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్టు మైనర్ ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గనిరాజు బుధవారం తెలిపారు. ఇప్పటికే అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో నీటి సంఘాల ఎన్నికలకు ఓటు వేసే ఓటర్ల రైతుల జాబితా సిద్ధం చేశారన్నారు. సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, రైతుసేవా కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా ప్రచురిస్తారని పేర్కొన్నారు. సాగునీటి సంఘం ఎన్నికల్లో పొలం ఉంటేనే ఓటు వేయడం కుదురుతుందని తెలిపారు.

మినీ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండలంలో మెట్ట గ్రామాలకు మధ్య ఉన్న రామారావుగూడెం గ్రామంలో మినీ లైబ్రరీ ఏర్పాటు చేయాలని 10 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అప్పారావుపాలెం, శ్రీరామవరం, మేధినరావుపాలెం, కంద్రికనర్సింహపురం, చల్లచింతలపూడి, ధర్మారావుపేట, పెరుగ్గూడెం, గాలాయగూడెం, గంగన్నగూడెం, జోగన్నపాలెం గ్రామాలకు రామారావుగూడెంలో మినీ గ్రంథాలయం ఏర్పాటు చేస్తే ప్రజలందరికీ అనువుగా ఉంటుందని చెబుతున్నారు. గోపన్నపాలెంలో ఉన్న గ్రంథాలయాన్ని ఎప్పుడో మూసివేశారని, కనీసం రామారావుగూడెంలోనైనా మినీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

దెందులూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం దెందులూరు, శ్రీరామవరం గ్రామాల్లో అంతర్గత రోడ్లకు శంకుస్థాపన చేశారు. రీసర్వే గ్రామ సభల్లో రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందుల్లేకుండా చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ అచ్యుత అంబరీష్

భీమడోలు: ధాన్యం సేకరణలో రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ, వ్యవసాయశాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. సార్వా సీజన్‌లో రైతుల సాగు విస్తీర్ణం, కోతకొచ్చిన పంట, ధాన్యం విక్రయం ఏ మేరకు జరిగింది? రెవెన్యూ ఫిర్యాదుల పరిష్కారం, భూసర్వే అర్జీలపై తీసుకున్న చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. భీమడోలు మండలంలో 13 వేల ఎకరాలకు ఇప్పటి వరకు 75 ఎకరాల్లో కోతలు కోశారని, దీపావళి తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుతుందని ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పారదర్శకంగా ధాన్యం సేకరించాలని, ఆర్‌బీకేల్లో గోనె సంచులు రైతులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. గ్రామాల్లో నిర్వహించిన భూసర్వే సభల్లో వచ్చిన అర్జీలను, మ్యూటేషన్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులు, వినతులకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, ఆర్ఐ కిరణకుమారి, సీఎస్‌డీటీ భరత్‌కుమార్, మండల సర్వేయర్ ధర్మారావు, వీఆర్వోలు వెజ్జు వినయ్‌కుమార్, సింహాచలం, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



చెరువులో నుంచి బయటకు తీసిన గంగరాజు మృతదేహం

పెదవేగి : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మరణించాడు. ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ గంగరాజు(75) బుధవారం ఉదయం ఆరు గంటలకు వాకింగ్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం న్యాయంపల్లి గ్రామ సచివాలయం పక్కన ఉన్న లింగం కుంట చెరువులో అతని మృతదేహం లభ్యమైంది. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు చొప్పెల్లి చిన్న నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయి ఉండవచ్చునని చిన్న నాగరాజు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య

భీమడోలు: మద్యానికి బానిసైన ఓ రోగి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని పాత అంబర్‌పేటకు చెందిన గాలి మహంకాళీరావు (50) ఏడాది క్రితం పక్షవాతానికి గురై వైద్యం చేయించుకుంటున్నాడు. ఆతను మద్యానికి బానిసై తీవ్ర మనోవేదనతో ఈనెల 21న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆతన్ని కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య గాలి సిరివేణి ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఓ వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ కథనం ప్రకారం మాదాసు సాయి అనే వ్యక్తి అమరావతిలో ఇంజినీర్‌గా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం ఇతనికి వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. ఇటీవల భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో అతడి భార్య హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో సాయిపై కేసు పెట్టింది. మనస్థాపంతో సాయి ఉరివేసుకుని మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. సాయి మృతదేహాన్ని ఏలూరు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సంపూర్ణ పారిశుద్ధ్యంతో ఆరోగ్యం



సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్

గణపవరం: సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ప్రజలంతా ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చని గణపవరం మండలం కాశిపాడు సర్పంచ్ తెర్లి నాగరాజు అన్నారు. బుధవారం గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. పంచాయతీ, ఆరోగ్యసిబ్బంది అంగన్‌వాడీ, ఆశ వర్కర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగునీరు, చెత్తాచెదారం ఎక్కడా నిల్వలేకుండా చూడాలన్నారు. గ్రామంలోని చెత్తకుప్పలను తొలగించారు. మురుగునీరు నిల్వలేకుండా జేసీబీలతో నీటిని బయటకు తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జాషువా, ఇంజినీరింగ్ సహాయకురాలు లావణ్య పాల్గొన్నారు.

ఈ-చలానాలు రద్దు కోరుతూ మంత్రికి వినతి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆటోలు, టాక్సీలపై ఈ-చలానాలను రద్దు చేయాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విజయవాడలోని ఆయన క్యాంప్ ఆఫీసులో బుధవారం ఉదయం సీఐటీయూ నాయకులు చక్రాల అమర్ కుమార్, జె.గోపి, బి.చంద్రశేఖర్ వినతి పత్రం అందజేశారు. ఏలూరు నగరంలో స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో విధిస్తున్న ఈ-చలానాలను రద్దు చేయాలని స్టాప్ లైన్, జీబ్రాలైన్, సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఆటోలు, టాక్సీలపై రూ.300 నుంచి రూ.30 వేల వరకు విధించడం వల్ల డ్రైవర్లు తీవ్ర ఆందోళన గురవుతున్నారని తెలిపారు. నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, జీఓ నెంబర్ 21 రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ శివాజీ, ముజఫర్ అహ్మద్ కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే లైసెన్స్‌లు రద్దు



హోటల్స్, మాల్స్, దుకాణాల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): బాలలను పనిలో పెట్టుకుంటే సంబంధిత దుకాణాలు, హోటల్స్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్ట ప్రకారం శిక్షిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ హెచ్చరించారు. రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగేశ్వరరావు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.సూర్య చక్రవేణి, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ ఏలూరులోని హోటల్, మాల్స్ యజమానులకు, ఉద్యోగులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 18 సంవత్సరాల్లోపు బాలలను పనిలో చేర్చుకొంటే దుకాణాల లైసెన్సు రద్దు చేయడమే కాక చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098 లేదా 15100కు సమాచారం అందించాలని కోరారు. డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీస్, పోలీస్ డిపా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యర్రమిల్లిపాడులో ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు: యర్రమల్లిపాడు గ్రామంలో ఈనెల 24 వతేదీ గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు పీఎంసీ అసోషియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని ఏర్పాటు చేసే ఈ శిబిరంలో విజయవాడ కామినేని, ఏలూరు శంకర్ నేత్రాలయ, తణుకు నిమ్మగడ్డ హస్పటల్ వైద్యులు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈసీజీ, 2డి ఎకో, కంటి, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేస్తారని, ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

6న ఫిషర్‌మెన్ సొసైటీలకు ఎన్నికలు

దెందులూరు: మండలంలో నాలుగు గ్రామాల్లో నాలుగు ఫిషర్‌మెన్ సొసైటీలకు నవంబరు 6న ఎన్నికలు నిర్వహించనున్నట్టు మత్స్యశాఖ దెందులూరు మండల ఇన్‌చార్జి సతీష్ అన్నారు. ఒక్కో సొసైటీకి 6, 7, 11 మంది సొసైటీ బైలాకు అనుగుణంగా సభ్యులు ఉంటారని, వారి నుంచి ఒకరిని ప్రెసిడెంట్, మరొకరిని వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకొంటామని తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్, నలుగురు ఉన్నతాధికారులను నియమించినట్టు చెప్పారు.

నేడు జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి అనేక సమస్యలు, అవినీతి ఆరోపణలు, గందరగోళ పరిస్థితులతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో గురువారం జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ వెట్రి సెల్వి అధ్యక్షతన నిర్వహించనున్నారు. సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా బోధనాసుపత్రిగా అభివృద్ధి చెందాల్సిన తరుణంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు కొన్ని పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. నిత్యం మెడికో లీగల్ కేసులు అధికంగా వస్తుండడంతో రోగులకు చికిత్స ఎప్పుడు చేయాలో అర్థం కావటం లేదని వైద్యులు వాపోతున్నారు. బెడ్లు సరిపోక విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేయాల్సి దుస్థితి నెలకొంది. జీజీహెచ్ ప్రాంగణంలోని క్యాంటీన్, మోడల్ డెయిరీ, ఫ్యాన్సీషాపు, సైకిల్ స్టాండ్‌లకు టెండర్ పిలిచి వేలం నిర్వహించాల్సి ఉండగా.. కరోనా నుంచి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. రోగుల సహాయకులకు కనీసం భోజనం చేసేందుకు సరైన సౌకర్యం లేదు. గతంలో దాతల సహకారంతో రూ.15 లక్షలతో ఒక షెడ్డు నిర్మించగా, ప్రస్తుతం మెడికల్ కాలేజీ కోసం వినియోగించటంతో సహాయకులకు నిలువనీడ లేదని చెబుతున్నారు. జీజీహెచ్ మార్చురీలో అనాథ శవాల వ్యాపారంపైనా దృష్టి సారించి పూర్తిస్థాయి దర్యాప్తుకు ఆదేశించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

మినీ గోకులం షెడ్ల నిర్మాణంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మనోజ్

ఉంగుటూరు: ఉంగుటూరు మండలానికి తొలి విడతగా 65 మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయని, వీటి నిర్మాణానికి రూ.2.30 లక్షలు ఖర్చు చేస్తామని ఎంపీడీఓ జీఆర్ మనోజ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మినీ గోకులాల పథకం లబ్ధిదారులు, ఉపాధి పథకం సిబ్బందికి మధ్య సమన్వయ సమావేశానికి ఎంపీడీఓ అధ్యక్షత వహించి మాట్లాడారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణ విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకాన్ని నిబంధన ప్రకారం అమలు చేయాలని సిబ్బందిని ఎంపీడీఓ మనోజ్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల నుంచి ఎంపికైన లబ్ధిదారులు రైతులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవుని ఆశీర్వాదం పొందాలి



ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

దెందులూరు: దేవుని ఆశీర్వాదం పొందేందుకు భయభక్తులు కలిగి జీవించాలని ప్రముఖ సువార్తీకులు జాన్ వెస్లీ సూచించారు. దెందులూరు మండలం అప్పారావుపాలెం గ్రామంలో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో బుధవారం ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఎలీషా ప్రసంగిస్తూ సమాజం పట్ల సేవాగుణంతో వ్యవహరించాలని సూచించారు. తొలుత పెదవేగి, పెదపాడు, దెందులూరు, కామవరపుకోట, భీమడోలు, ఏలూరు మండలాల నుంచి వచ్చిన విశ్వాసులు తమ అద్భుత సాక్ష్యాలను వివరించారు. పాస్టర్ జాన్ వెస్లీకి దెందులూరు మండలం పాస్టర్ల అసోసియేషన్ పౌర సత్కారం చేసి జ్ఞాపిక అందజేశారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి



కొవ్వలి పాఠశాలలో ఆధార్ క్యాంపుకు పోటెత్తిన గ్రామస్తులు

దెందులూరు: ఆధార్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.శ్రీదేవి సూచించారు. కొవ్వలి పాఠశాలలో హెచ్‌ఎం జీఎస్‌ఎల్‌ఎన్‌వీ శర్మ ఆధ్వర్యంలో ఆధార్ క్యాంపు నిర్వహించారు. అధిక సంఖ్యలో ఆధార్ మార్పులు, చేర్పులు కోసం తరలివచ్చారు. దెందులూరులో కూడా ఆధార్ క్యాంపు నిర్వహించారు.

ఏఈఓగా కొల్లి ఆదిత్య



భీమడోలు: మండలంలోని దుద్దేపూడి రైతు భరోసా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకుడు కొల్లి ఆదిత్యకు నిడమర్రు మండలం భువనపల్లి సర్కిల్ ఏఈఓ 2గా ఉద్యోగోన్నతి లభించింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా గ్రామ వ్యవసాయ సహాయకుడిగా పూళ్లకు చెందిన కొల్లి ఆదిత్య దుద్దేపూడి వీఏఏగా ఉద్యోగం లభించింది. ఐదేళ్ల తర్వాత ఆదిత్యకు పదోన్నతి లభించింది. భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏఓ పి.ఉషారాణిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

వెంకటేష్‌కు నివాళి



వెంకటేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెదవేగి : మంచి మనస్సు పిలిస్తే పలికే వ్యక్తి వెంకటేష్ లేని లోటు తీరనిదని వైఎస్సార్ సీపీ నేతలు విచారం వ్యక్తం చేశారు. పెదవేగి మండలం జగన్నాథపురం సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు అన్న కుమారుడు మాత్రపు వెంకటేశ్వరరావు(30) ఈ నెల 13న విద్యుద్ఘాతంతో మృతిచెందిన విషయం విధితమే. బుధవారం వెంకటేష్ సంస్మరణ సభ ఆయన నివాసంలో నిర్వహించారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి మాత్రపు నాగభూషణం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

మైనర్ ఇరిగేషన్ ఏఈగా లాజర్‌బాబు

దెందులూరు: దెందులూరు మండల మైనర్ ఇరిగేషన్ ఏఈగా లాజర్ బాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాగు పూర్తిస్థాయిలో రైతులకు ఇబ్బందులు లేకుండా సమష్టి కృషితో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గనిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

స్టేడియం.. ఆయాసం



ఎండలోనే విద్యార్థులు



ఎండలో నేలపైనే క్రీడాకారుల పడిగాపులు

ఏలూరు ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో విద్యార్థులకు జిల్లా స్థాయి గేమ్స్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నారు. కబడ్డీ, హ్యాండ్ బాల్ తదితర ఆటల్లో విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. విద్యార్థులు సేదదీరడానికి కనీసం చిన్న టెంట్, దాహం తీర్చుకునేందుకు మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదు. బుధవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండలోనే విద్యార్థులు నేలపైనే కూర్చొని ఆపసోపాలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



ఎండకు పైటకొంగులు కప్పుకున్న పీఈటీలు, క్రీడలకు తిలకించేవారు



గ్రౌండ్‌లో కనిపించని టెంట్